"ఇందరూ ఆడపిల్లలే అయితే నన్నేం చెయ్య మని. ఏ సముద్రములో ఉరకమని! మహాపాప మేదో చేస్తేకాని ఈలాటి పాపం సంభవించదు. వాళ్ళందరినీ ఏ గంగలో కూలవెయ్యను? గర్భ దరిద్రునికి అల్లుడిగావచ్చే దెవడు? ఒక్కసారిగా భగవంతుడు నన్ను తీసికొనైనా వెళ్ళడు." నాన్న భాష అంతకంతకు తీవ్రమౌతోంది. అమ్మ మూలుగు ఎక్కడ విలీనం అయిందో... శబ్దంలేదు. కన్నులు తుడుచుకొని చూచాను. చిందరవందరగా పడివున్న పుస్తకాలు. మా నాన్నే వీటి నన్నిటిని విసరికొడుతున్నాడని త్రుటిలో గ్రహించాను. అంతేకాదు. నాన్న నేలకు తల బాదుకొంటున్నాడు. అప్పుడప్పుడు "ఆడపిల్లల తండ్రిని బ్రతికిలాభంలేదని" పలికే నాన్న మాటలు "అబ్బబ్బ,మీరందరునాన్న ప్రాణాలుతీయడానికే పుట్టారు. బీదవాళ్ళకు ఇలా శిక్షవేసే దేముడి అభిప్రాయ మేమిటో" అని నిట్టూర్చే నిట్టూర్పులు నాతలలో పునఃవ్యాఖ్యా నింపబడ్డాయి. ఏం చెయ్యాలి? తొందరగా నాన్నదగ్గరకు పరు గెత్తాను. తల పగిలిపోతుందేమో అని భయంతో నాన్నా అని అరిచాను. "ఛీ ఛీ, మాల. ఘో దూరంగా నీ వేముహూర్తాన పుట్టావో నాకొంపకి దరిద్రమే పట్టింది. ఛండాలపు మొఖం ఉరికి చావరాదూ" అంటూ తీవ్రంగా అంటూనే తల బాదుకుంటున్నాడు నాన్న. అయితే నా పుట్టు కలో ఇంత దరిద్రకారణముందని నాకా గడియ లోనే తెలిసింది, అమ్మవైపు పరుగెత్తుదామనే వాంఛనుకూడా ఆ చీవాట్లే నిలవేసేశాయి.

ఎన్నిమాసాలో భారంతో క్రుంగిపోయే శరీ రాన్ని, ఆ యిరుకుకొంప కంకితంచేసి కండరాలు కరగించుకొనే శక్తి, రక్తమంతా నీరు చేసికొనే శక్తి అమ్మకే భగవానుడు ప్రసాదించాడో విషమసమస్య అయిపోయింది.

మంత్రసాని దొడ్డిదోవన పారిపోయిందని, ఉపచారదక్షతలేకపోతే బాలెంతరాలుకు ప్రాణా పాయమని హెచ్చరిస్తూ మాయింటిలోని రోదన ధ్వనులను వినలేక కాబోయి దుర్గమ్మగారు త్రోవ తీసింది. నేను కంగారుగా పురిటిగదివైపు పరు గెత్తాను. మానాన్న విసరివేచిన కత్తిపీట త్రోవ లోనే ఉందిగావును.తగిలి బోర్లపడ్డాను. ఎక్కడ చీరుకుందో. రక్తం జాలిలేకుండా ప్రవహించింది.

* * *

ఇప్పుడు నేను ఒక ఉపాధ్యాయునికి అర్థాం గినిలెండి. సుఖంగానే ఉన్నా...మా తమ్ముడు "రామూ"వీధిబడిలో మూడవతరగతి చదువుతు న్నాడు. మా నాన్న కుంకంబొట్టుకొంచెం సన్న గిలిందికాని తమ్ముడిపొట్ట లావుబారుతోంది... జబ్బుశరీరం, దగ్గు, ఆయాసము, సరిగానడవలేడు. తిన్నది కక్కుకుంటాడు. అయినా మా నాన్న కేనుగునెక్కినంత ఆనందం, మా అమ్మకు బాకీతీరి నంత సంతోషం. నాకుమాత్రమే అన్నీ విషమ సమస్యలు.

ఏది జ్ఞానమో, ఏది అజ్ఞానమో తెలియని మానవులము మరి.

స్కెచ్

# నిచ్చెనకి అందని స్వర్గం

పావనరాం

మూర్తీ, నేనూ ప్రాణస్నేహితులం. ఎప్పుడూ మేమిద్దరమూ కలిసి తిరుగుతూండడం వల్ల—"తనువులు వేరైనా, మనస్సులొకటే"— అన్న తంతువాళ్ళలో మమ్మల్నిద్దర్నీ జమకట్టే వారు—మా మిత్రబృందం.

స్వతహాగా మూర్తి మాటకారి. క్రొత్తవాళ్లతో ఇట్టే పరిచయం కలుగజేసుకోగలడు. కనుకనే అతని"స్నేహితుల బృందం"పెద్దది. నేను మూర్తికి స్నేహితుణ్ణి కావడంచే, అతని మిత్రులందరితో నాకుకూడా కొద్దో, గొప్పో పరిచయభాగ్యం కలిగేది.

ఓనాడు, రీడింగ్ రూమ్‌దగ్గర మాకో వ్యక్తి కనబడ్డాడు. అతణ్ణి మూర్తి నాకు "ఇంట్రు డ్యూస్"చేశాడు—"ఇతనూ, నేనూ గుంటూరులో కలిసి చదువుకొన్నాం, పేరు చంచలరావు ఇక్కడ యూనివర్సిటీలో "కెమిస్ట్రీ"లో డి.

యస్. సి. కి రిసెర్చి చేస్తున్నాడు. చాలా చురుకైనవాడు.” చంచలరావు వెళ్ళిపోయాక మూర్తి అన్నాడు,“మంచిపుష్” ఉన్న మనిషిరా. ప్రపంచంలో సులువుగా గెంటుకుపోగల సామర్థ్యంగల వాడు” అని.

*　　　*　　　*

మరో నాలుగు నెలల తర్వాతమాట.

“బీచ్ రోడ్డు” వెంబడే వెళ్తున్నాం, మూర్తీ, నేనూను. చంచలరావు మాకెదురయ్యాడు.

అతనిచేతిలో “డిస్కవరీ ఆఫ్ ఇండియా” ఉంది. మూర్తి అడిగేశాడు—

“ఏమోయ్! నీ రిసెర్చి కెమిస్ట్రీలోనా లేక హిస్టరీలోనా”—అని, నవ్వుతూను.

“అదేమిటోయ్ అల్లాగంటావ్. నేను నెక్స్ట్ సెప్టెంబరులో ఐ. ఏ. ఎస్.కి “ఎప్పియర్”కాబోతూంటే!”—అన్నాడు.

మొన్న మొన్న డి. యస్. సి. అన్నాడు. ఇప్పుడు ఐ. ఏ. ఎస్. అంటున్నాడు. ఏమిటా? అని నేను కొశ్చెన్ మార్కులా ముఖంపెట్టాను.

అతను నాకు సమాధానంగా మూర్తితో అంటున్నాడు-ఈ ఎమ్.ఎస్. సిలూ డి.ఎస్.సీలూ తెచ్చుకొని, యూనివర్సిటీలో బూజుపట్టి పోవడమే కాదుటోయి! పుష్ లేదు. అరవ్వాళ్లలో ఉన్న ‘ఎడ్వెంచరస్ స్పిరిట్’ మనకి లేదు. ఒక ఆర్నెల్లు కష్టపడి చదివి, జనరల్‘నాలెడ్జ్’ మీద కొట్టుకుపోయి—ఈజీగా సెలక్టయిపోవచ్చు”న్నాడు.

“గట్టిగా ప్రయత్నించండి. తప్పక సెలక్టవుతా”రన్నాను అతని యత్నాన్ని అభినందిస్తూ.

*　　　*　　　*

ఇంకో ఆరునెలల తదుపరి.

“గుప్తా బ్రదర్సు” షాపులో ఎవరో అడుగుతున్నారు-మూర్తిని.

“ఏమండీ మీ చంచలరావు “ఫారెన్” వెళ్తాడట, నిజమేనా?”అని.

నేనూ,మూర్తీకూడా చాలాఆశ్చర్యపోయాం. కుతూహలంకొద్దీ చంచలరావు ఇంటికెళ్ళాం.

“ఏమోయ్, ఫారెన్ వెళ్తావుటేమిటి?




డన్‌లప్
మీద
సుఖప్రయాణం
చేయండి

DCX-2 TE

చెప్పావుకదూ? ఓ పెద్ద టీ పార్టీ పడేయాలి—ఇన్ ఆంటిసిపేషన్" అన్నాడు మూర్తి.

"అప్పుడే నీదాకా వచ్చిందీ? ఏదో అప్లై చేశాను. మరో పదిహేనురోజుల్లో "ఇంటర్వ్యూ" అవుతుంది. ఈ రోజుల్లో 'ఫారెన్' వెళ్ళడం ఏం డిఫికల్ట్ కాదోయ్! నేను "కాలిఫోర్నియా" వెళ్దామనుకుంటున్నాను. అక్కడేమేమే సెలక్ట్ చేసుకో వచ్చులే! ఓ ఏడు 'సిన్సియర్'గా వర్కు చేస్తే చాలు, పి. హెచ్. డి. కొట్టెయ్యచ్చు. చల్లగా అక్కడే సెటిలయిపోవచ్చు. ఇక్కడేముందండీ 'థ్రిల్' ఉండదండీ ఇక్కడ లైఫ్‌లో"—అని నావేపు చూస్తూ (ఆ చివరివాక్యం అని) తన ఉపన్యాసాన్ని ముగించాడు–చంచలరావు.

*   *   *

చంచలరావుకి సెలక్షన్ రాలేదని తెలిసింది. నేను మావాడితో అన్నాను.

"ఏరా, మీవాడు అమెరికాలో "సెటిల్" అయిపోదామనుకుంటూంటే, పాపం అతన్ని ఇంటర్వ్యూలో సెలెక్టు చేసుకోలేదు టేమిటి?" అని.

"వాడి మొఖం లెద్దూ. వీడి బాబుల్లాంటి వాళ్లున్నారు. డి. యస్. సి. వచ్చినాయన్నే ఒకాయన్ని సెలక్టు చేసుకున్నారుట" అన్నాడు మూర్తి.

చంచలరావు మాకు ఇంటర్వ్యూ తర్వాత కన బడినప్పుడన్నాడు. "ఎంతసేపూ పాశ్చాత్య దేశాల్లోనిదే శాస్త్రం, మనదేశాలలో ఏమీలేదను కోవడం పెద్దపొరపాటు. ఈ మోజు తగ్గాలని సర్. సి.వి. రామన్ అంతటి మహావిజ్ఞాని ఊరికే అన్నాడా?"

*   *   *

ఇంకో ఏడాది గడిచింది.

సైకిల్ మీద జాకెట్టు గుడ్డలాంటి గుడ్డతో కుట్టబడిన బుష్‌కోటుతో, సిగరెట్టు కాలుస్తూ, వెళ్ళిపోతున్నాడు చంచలరావు.

చప్పట్లుకొట్టి మూర్తి అతన్ని ఆపాడు.

"ఏమిటోయ్! ఈమధ్య అసలు కనబడటం లేదు. ఆమధ్య అమలాపురం వెళ్ళావుట ఏమిటి విశేషం?"

"రా, చెప్తాన"ని వద్దంటున్నా మమ్మల్నిద్దరినీ కృష్ణా కేఫ్‌లోకి లాక్కెళ్లాడు.

"ఎవడో లాయరటోయ్! రెండు నెలల్నుంచీ చంపుతున్నాడు మా ఫాదర్ని. అతని తమ్ముడు కూతుర్ని నన్ను చూడమంటాడు. ఆఖరికి సరేనని చూపులకి వెళ్లాను." అని కాఫీ గ్లాసు ఖాళీ చేశాడు. "పిల్లబాగానే ఉందోయ్! కానికట్నం మాట వాళ్ళేమీ మాట్లాడటంలేదు. మా ఫాదర్ 'టెన్ థౌజండ్' అంటున్నారు" అన్నాడు.

"ఆమాత్రమేనా ఇవ్వకపోతే ఎల్లాగోయ్! రేపు నేను బెంగుళూరు వెళ్ళి ఇన్‌స్టిట్యూట్‌లో చేర్తాననుకో. కాపరంపెట్టే మరి పైసాఉండొద్దూ" అన్నాడు. (యూనివర్సిటీలో రిసెర్చి అయింది; ఇక ఇన్‌స్టిట్యూట్‌లో తరవాయి.) అక్కడికి అల్లుణ్ణి కూడా మేపడం పిల్లనిచ్చేవాడి విధ్యుక్తధర్మం అయినట్లు.

పందరూపాయలు తెచ్చుకుంటూ, డిమాన్‌స్ట్రేటర్‌గా ఉంటున్న చంచలరావు —పదివేలు— కట్నం రూపేణా ఆశిస్తున్నాడంటే నాకు గుండె ఆగినంత పనయింది.

ఓ అరగంట తర్వాత హోటల్లోంచి ఇవతల పడ్డాం.

*   *   •

నాకు విజయవాడలో ఉద్యోగమయింది.

మళ్ళీ రెండేళ్ళకి నేనూ, మూర్తీ కలుసుకున్నాం. "వాడేం చేస్తున్నాడు? వీడేం చేస్తున్నాడు?" అనే సంభాషణ ధోరణిలో నాకు చంచలరావు మాట చటుక్కున గుర్తొచ్చింది.

"ఏరా! అన్నట్టు మీ చంచలరావు ఏంచేస్తున్నాడు?"

"ఏంచేస్తాడు? నాలుగేళ్ళు అయిపోయింది. డిమాన్‌స్ట్రేటర్ గిరీలోంచి తప్పుకోమన్నారు. (యూనివర్సిటీలోనాలుగేళ్ళు డిమాన్‌స్ట్రేటర్‌గా పనిచేస్తే, దానితో ఆ మనిషి కుద్యాసనే - ఈ లోపుగా లెక్చరర్ కాకున్నట్లయితే) అంచేత ప్రస్తుతం మావాడు నిరుద్యోగ డిపార్టుమెంటుకి సెక్రెటరీ. ఏదో "ఎఫిలియేటెడ్ కాలెజెస్"లో ప్రయత్నిస్తున్నాడని విన్నా"నన్నాడు మూర్తి.

"ఒకచో నేలనుపవ్వళించు నొకచోనొప్పారు పూసెజ్జపై" అని కార్యసాధకుణ్ణి గూర్చి భర్తృహరి అన్న సుభాషిత వాక్యం జ్ఞప్తికి వచ్చింది.

(8-వ పేజీ తరువాయి)

చేయడానికే ఈ సమాలోచనలు జరిగేయి. సాధ్యమైనంతత్వరలో కంట్రోళ్లు రద్దుచేయడానికే నిశ్చయింపబడినది. అసంతృప్తిగా అమలుజరుప బడే కంట్రోళ్లవల్ల ప్రజలలో కలిగే అసంతృప్తిని రాజకీయ ప్రయోజనాలకు ఉపయోగించదలచు కునేపార్టీలు తప్ప మిగిలినవారంతా ఆహారపదార్థాల కంట్రోలుకు వ్యతిరేకులే. అందుచేత ఈనిర్ణయాన్ని దేశం స్థూలంగా హర్షిస్తుంది. కాని మన రాష్ట్రంలో డీకంట్రోలువచ్చినాక బియ్యం ధరలు ఆకాశాన్నంటినాయి. కొన్నిచోట్ల రెట్టింపువరకు హెచ్చినాయి. ఈ ధరలు హెచ్చుకాకుండా తగు కట్టుదిట్టములుచేసి ఆహారధాన్యాలు డీకంట్రోలుచెయ్యడం చాలా అవసరం.

* * *

## సంతోషించదగిన మార్పు

ఈ మధ్యనే ఆంధ్రరాష్ట్రం విషయమై తన కడుపులోని భావాలను ధైర్యంగా వెలిబుచ్చిన సంజీవరెడ్డిగారు, నేటి కాంగ్రెసు సంస్థ దుస్థితి గురించి కాకినాడలో కాంగ్రెస్ సేవకుల సమావేశంలో చెప్పిన మాటలు మిక్కిలి హర్షింపదగినవి. కాంగ్రెస్‌లో ధనికులు ప్రవేశించి స్వార్థరహితమైన తమ త్యాగంతోనూ, సేవాపరాయణత్వంతోనూ కాంగ్రెస్ సంస్థను పెంచి పోషించిన నిజమైన దేశసేవకులకు స్థానంలేకుండా చేస్తున్నారనీ అందువల్ల ప్రదేశ కాంగ్రెస్ అధ్యక్షునికి తగినంతగా సభ్యుల సహకారం లభించడంలేదు కనుక తాను తిరిగి ఆంధ్రప్రదేశ కాంగ్రెస్‌కు పోటీచెయ్యడంలేదనీ చెప్పేరు. సంజీవరెడ్డిగారు తమ నిశ్చయాన్ని చివరంటకొనసాగించుకోగలిగితే ధన్యులే. కాంగ్రెస్‌ను వదలి వెళ్ళినవారు చాలాకాలంక్రిందట గ్రహించిన విషయాన్ని రెడ్డిగారిప్పటికైనా గుర్తించినందుకు సంతోషమే. కాని అభిప్రాయ ప్రకటనతో తనపని తీరిన దనుకోవడం మాత్రం పొరబాటు. పొరబాటే కాదు. అపరాధం కూడాను. ప్రతిష్ఠకు పెనగులాడక ఓపినంతవరకు కాంగ్రెస్‌ను వదలిన పెద్దలను సమాధానపరచి, కాంగ్రెస్‌ను బలపరచడం ఆయన విధి. కేవలం అధికారాలకోసం కాంగ్రెస్‌ను చేపట్టుతున్న కొత్త కాంగ్రెస్ జనాభాను అదుపులోనుంచి దేశసేవయందు ముక్కాకలు తీరిన


# ఆంధ్ర బ్యాంక్, లిమిటెడ్

( స్థాపితము—1923 )

హెడ్డాఫీసు : మచిలీపట్టణము

చెల్లింపబడిన మూలధనము, రిజర్వులు కలిసి
మొత్తం—రు. 36,73,500

అమలులోనున్న వ్యాపారం మొత్తం—
రు. 6,00,00,000 లకు మించినది.

చైర్మన్ :
శ్రీ ఎస్. ఆర్. వై. శివరామప్రసాద్
బహదూర్‌గారు, చల్లపల్లి రాజాసాహెబ్.

డెప్యూటీచైర్మన్ :
శ్రీ కె. సుబ్బారావునాయుడుగారు,
మచిలీపట్టణము.

మేనేజింగ్ డైరెక్టర్ :
శ్రీ తాడేపల్లి శ్రీరాములుగారు.

మద్రాసు బ్రాంచి. 322-23, లింగిచెట్టి వీధి

త్యాగరాయనగర్ ఆఫీసు :
87, త్యాగరాయరోడ్డు, త్యాగరాయనగర్

మైలాపూర్ ఆఫీసు :
77, కచేరీరోడ్డు, మైలాపూర్

ఉత్తర సర్కారులందంతటనూ, రాయలసీమలోనూ బ్రాంచీలు, సబ్ ఆఫీసులు కలవు.

అన్ని రకముల డిపాజిట్లు ఆకర్షణీయమైన వడ్డీరేట్లకు తీసుకొనబడును.

అన్ని రకముల బ్యాంకింగు వ్యాపారములు చేయబడును.

వివరములు బ్యాంకుయొక్క ఏ ఆఫీసులో నైనను తెలుసుకొనవచ్చును.

ఏతేశ్వరపు రామచంద్రమూర్తి,
ఎం. ఏ., సి. ఎ. ఐ. ఐ. బి.,
జనరల్ మేనేజరు.

వారి తోడ్పాటుతో పార్టీని బలపరచడం దేశానికి సర్వవిధాలా శ్రేయస్కరం. సంజీవరెడ్డిగారు అంతవారైతే ఆంధ్రదేశంలోని ప్రజల మన్ననలకు పాత్రులవుతారు.

*  •  *

## సంతకాల ఉద్యమం

ఆంధ్రరాష్ట్ర నిర్మాణంకోసం సీతారాం స్వాములవారు కురుక్షేత్రంలో ప్రాయోపవేశం చేయబోతుంటే కమ్యూనిస్టు సోదరులు నిష్పేచీగల ఆంధ్రప్రాంతాలతో వెంటనే రాష్ట్రం ఏర్పాటుచేయాలని కోరుతూ ప్రాజ్ఞత వచ్చిన స్త్రీపురుషు లందరిచేతా సంతకాలుచేయించే "మహోద్యమం" సాగిస్తామని చెపుతున్నారు. ఇండియాకు స్వరాజ్యం కావాలని 1918-19 సం॥ రాల్లో ఇండియామంత్రి మాంటేగుకు సంతకాలు సమర్పించిన మహోద్యమాన్ని ఈ ఉద్యమం జ్ఞప్తికి తెస్తోంది. 20వశతాబ్దపు ద్వితీయఖండంలో ఈలాంటి ప్రయత్నం చేయడం హాస్యాస్పదం. ఆనాడు స్వరాజ్యోద్యమానికి సంతకాలెంత ఉపయోగపడ్డాయో ఆమాత్రంకూడా ఈనాడు ఉపయోగించవు. మంత్రాలకు చింతకాయలు రాలవు కదా! మాటల్లో కోటలను దాటించే "అతివాదులు", రాష్ట్రంకోసం మహోద్యమం నడపడానికి బదులు ఈలాంటి మితవాదిత్వాన్ని ప్రదర్శించడం చూస్తే ఆశ్చర్యం, జాలి కలుగక మానదు.

*  •  *

## సూడాన్ స్వాతంత్ర్యం

ఈజిప్ట్ మిలిటరీ ప్రధాని జనరల్ నజీబ్ యాజమాన్యాన సూడాన్ దేశానికి స్వేచ్ఛ లభించింది. రెండుసెల్లలో సర్వస్వతంత్రమైన పార్లమెంటు ఏర్పడబోతోంది. ఈ రెండుసెలలూ బ్రిటిష్ గవర్నరు నామమాత్రంగా పరిపాలన సాగిస్తూ ఉంటాడు. ఒక ఆంగ్లరాజ్యప్రతినిధి, ఒక ఈజిప్టు రాజ్యప్రతినిధి, ఒక భారత ప్రతినిధితో కూడిన ఒక సంఘము పార్లమెంటరి ఎన్నికలు నిష్పాక్షికంగా జరుపడానికి నియమింపబడుతుంది. ఈజిప్టు ప్రభుత్వం స్వరూపం మారడంతోనే బ్రిటిష్ రాజ నీతిజ్ఞతక్రింద కట్టుమిట్టగుతున్న ఈ దేశానికింత, శీఘ్రంగా విముక్తి కలుగడం గమనార్హం. ప్రజాస్వామిక రాజ్యాంగాల్లోకన్న సద్భావంతో వ్యవహరించే డిక్టేటరు రాజ్యంలో ఒక్కొక్కప్పుడు శీఘ్రంగా ప్రజాక్షేమం సాధించబడుతుందనడానికిదొక నిదర్శనం. పరిపాలనా సౌకర్యం కోసం, ప్రశస్తమైన ప్రాంతీయ సంస్కృతి వికసింప చేసుకునే నిమిత్తము ఆంధ్రులు ప్రత్యేక రాష్ట్రాన్ని కోరితే దానికి అనేక విధాలైన అడ్డంకులు కలిగిస్తున్న మన ప్రజాప్రభుత్వం ధోరణిని నజీబ్ ధోరణితో పోల్చుకున్నప్పుడు పై భావము స్ఫురించక మానదు. కాలపరిణామాన్ని గమనించి బ్రిటిష్ పాలకవర్గం జనరల్ నజీబ్ ప్రయత్నాలకు సర్వవిధాల తోడ్పడడం వారి దూరదృష్టికి, రాజనీతిజ్ఞతకు ప్రత్యక్ష నిదర్శనాలు.

*  *  •

## తెలుసుకోదగిన అంతర్యమే

కూర్గురాష్ట్రంలో సుంతికొప్ప అనే గ్రామములో 17 సంవత్సరముల వయస్సు గల ఒక అమ్మాయి, ఆరుసెలలనుంచి అన్నోదకాలు ముట్టుకోకుండా మామూలుగానే ఇంట్లో పనిపాటలు చేసుకుంటూ కాలక్షేపం చేస్తోందని పార్లమెంటు మెంబరు సోమన్నగారు తెలుపుతున్నారు. ఈ సంగతే నిజమైతే, ప్రస్తుతం ప్రజలకు అన్నోదకాల నివ్వలేకుండా సతమత మవుతున్న మన ప్రభుత్వం ఈ విపరీతం యొక్క అంతర్యాన్ని గ్రహించగలిగితే గొప్ప విషయమే. బియ్యానికి బదులు కృత్రకమైన బియ్యం తయారుచేయడానికి, వర్షం కృతకంగా తయారుచేయడానికీ, పరిశోధనలుచేయలేక బాధపడుతున్న మన ప్రభుత్వం ఆ అమ్మాయి జీవిత రహస్యాన్ని కనిపెడితే మనకికలోటేమీ ఉండదుకదా! ఆహారమంత్రులు, ఐదు సంవత్సరాల ప్రణాళికలు, ఇరిగేషన్ స్కీములు అక్కరనేలేదు. ప్రజలు ఆకలి దప్పులను జయిస్తే ఇక కావలసినదేమున్నది!

రాజకీయాలు క్రమంగా ఒక మురికిగుంటగా తయారవుతూంటే చూస్తూ ఊరుకుని, ఆ తరవాత వాటిని నిందించడం క్షమించరాని నేరం.—హావర్డ్ క్రాస్‌బీ